# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-04-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి కూడా న్యాయం అందించినప్పుడే దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి పేర్కొన్నారు.**

**2. తమ ప్రభుత్వం పౌర సేవల్లో అనుసరణీయ మార్పులు తీసుకువచ్చిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు.**

**3. ఓటరు అవగాహనా కార్యక్రమం స్వీప్‌లో భాగంగా విశాఖలో ఈరోజు 5కె రన్ నిర్వహించారు.**

**4. చైనాలోని షాంఘైలో జరుగుతున్న ఆర్చరీ ప్రపంచ కప్‌లో భారత్ మరో స్వర్ణ పతకాన్ని సాధించింది.**

============================

సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి కూడా న్యాయం అందించినప్పుడే దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి పేర్కొన్నారు. చిత్తూరులో 40 కోట్ల 30 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన న్యాయస్థానాల భవన సముదాయాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయి మాట్లాడుతూ న్యాయవాదులు సామాజిక స్పృహతో వృత్తికి అంకితమవ్వాలని సూచించారు.

-------------------------

తమ ప్రభుత్వం పౌర సేవల్లో అనుసరణీయ మార్పులు తీసుకువచ్చిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మలి విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఈరోజు అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు ఇవి అని అన్నారు. లంచాలు.. వివక్ష లేని పారదర్శక పాలన అందించామని తెలిపారు. అనంతరం ఆయన ఈరోజు తిరుపతి లోక్‌సభ స్థానం పరిధిలోని వెంకటగిరిలో.. నెల్లూరు లోక్‌సభ స్థానం పరిధిలోని కందుకూరులో జరిగే సభల్లో ప్రసంగిస్తారు.

-------------------------

విశాఖపట్నం జిల్లాలో వంద శాతం పోలింగ్ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.మల్లిఖార్జున పిలుపునిచ్చారు. ఓటరు అవగాహనా కార్యక్రమం స్వీప్‌లో భాగంగా ఈ ఉదయం బీచ్ రోడ్‌లో రన్ ఫర్ ఓట్ పేరుతో 5కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మల్లిఖార్జున మాట్లాడుతూ మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో అందరూ భాగస్వాములు కావాలని... ఓటింగ్ శాతం పెంపొందించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 1991 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

---------------------------

చైనాలోని షాంఘైలో జరుగుతున్న ఆర్చరీ ప్రపంచ కప్‌లో భారత్ మరో స్వర్ణ పతకాన్ని సాధించింది. రికర్వ్ విభాగంలో భారత్ 5–1 తేడాతో దక్షిణ కొరియా జట్టును ఓడించింది. ధీరజ్ బొమ్మదేవర, తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ జాదవ్‌తో కూడిన భారత జట్టు ఒలింపిక్ ఛాంపియన్ అయిన దక్షిణ కొరియాపై విజయం సాధించింది. దీంతో భారత్ ఐదో స్వర్ణాన్ని సొంతం చేసుకుంది.

ఇదిలా ఉండగా ఆర్చరీ ప్రపంచకప్‌లో వరుసగా మూడు స్వర్ణాలు సాధించిన రెండో ఆర్చర్‌గా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వెన్నం జ్యోతి సురేఖ ఘనత సాధించారు. కాంపౌండ్ మహిళల వ్యక్తిగత, టీమ్, మిక్స్‌డ్ విభాగాల్లో ఆమె పసిడి పతకాలు గెలుచుకున్నారు. జ్యోతి సురేఖ వ్యక్తిగత ఫైనల్లో మెక్సికోకు చెందిన టాప్ సీడ్ ఆండ్రియా బెకెరాను ఓడించారు. ఈ విజయంతో ఆమె అక్టోబరులో మెక్సికోలో జరిగే ఆర్చరీ ప్రపంచకప్ ఫైనల్‌కు అర్హత సాధించారు.

---------------------------

మహిళా సాధికరిత, గ్రామాభివృద్ధి అంశాలపై ఎంపిక చేసిన ప్రతినిధులతో అమెరికాలోని న్యూయార్క్‌లో వచ్చే నెల 3వ తేదీన జరగనున్న కమిషన్ ఆన్ పాపులేషన్ డెవలప్‌మెంట్ 57 వ వార్షిక సదస్సులో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం పేకేరు గ్రామ సర్పంచ్ హేమకుమారి ఆహ్వానం అందుకున్నారు. ఈ సందర్భంగా హేమకుమారి ఆకాశవాణితో మాట్లాడుతూ.... పేకేరు గ్రామంలో రహదారులు, త్రాగు నీరు వంటి మౌలిక సౌకర్యాలు కల్పించడంతోపాటు మహిళల ఆర్థిక స్వావలంభన దిశగా తాను చేపట్టిన కార్యక్రమాలే ఈ ఎంపికకు ప్రాతిపదిక అని హర్షం వ్యక్తం చేశారు. దేశంలోని రాజస్థాన్, త్రిపుర నుంచి ఎంపికైన ఇద్దరు ప్రతినిధులతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి తాను ఎంపికైనట్టు ఆమె తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ...

**.......వాయిస్ 25 సెకన్లు......**

---------------------------

తిరుమలలో మే నెలలో జరగనున్న విశేష ఉత్సవాలకు సంబంధించిన వివరాలను తిరుమల తిరుపతి దేవస్థానం ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. మే 3వ తేదీన భాష్యకారుల ఉత్సవం, మే 4వ తేదీన సర్వ ఏకాదశి, 10వ తేదీన అక్షయతృతీయ, 12వ తేదీన భాష్యకారుల శాత్తుమొర, రామానుజ జయంతి, శంకర జయంతి, మే 17 వ తేదీ నుంచి 19వ తేదీ వరకు పద్మావతి పరిణయ ఉత్సవాలు, మే 22వ తేదీన నృసింహ

జయంతి, తరిగొండ వెంగమాంబ జయంతి, 23వ తేదీన అన్నమాచార్య జయంతి, కూర్మ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఒక ప్రకటనలో తెలియజేసింది.

---------------------------

ఈఎస్ఐసీ పరిధిలోకి వచ్చే కార్మికుల పిల్లలకు 2024-25 విద్యాసంవత్సరానికి 'ఇన్స్యూర్డ్ పర్సన్స్' కోటా కింద వైద్య, దంత వైద్య, నర్సింగ్ కళాశాలలో ప్రవేశాలకు ఈఎస్ఐసీ ప్రకటన జారీ చేసింది. జాతీయ అర్హత పరీక్ష యూజీ-నీట్-2024లో అర్హత సాధించిన విద్యార్థులు దీని కింద సీట్లు పొందేందుకు అర్హులని తెలిపింది. అయితే అభ్యర్థులకు ఈఎస్ఐసీ జారీ చేసిన 'వార్డ్ ఆఫ్ ఇన్స్యూర్డ్ పర్సన్' సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. దీనికి సంబంధించిన వివరాలు ఈఎస్ఐసీ వెబ్సైట్లో అందుబాటులో ఉన్నాయని, మే 12 వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది.

---------------------------

వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ పాత మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలనే నిలబెట్టుకోలేదని.. ఇప్పుడు కొత్త మేనిఫెస్టోను ప్రజలు ఎలా నమ్మాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. విశాఖపట్నంలో ఈరోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన మద్య నిషేధం హామీని అమలు చేయకపోగా.. ప్రభుత్వమే విక్రయిస్తోందన్నారు. మెగా డీఎస్సీ అమలు కాలేదని విమర్శించారు. ఏటా సంక్రాంతికి ఇస్తామన్న జాబ్ క్యాలెండర్ ఏమైందని ప్రశ్నించారు. రైతులకు ధరల స్థిరీకరణ నిధి పేరిట 3 వేల కోట్ల రూపాయలను కేటాయిస్తామన్నారు.. ఒక్క ఏడాదైనా కేటాయించారా అంటూ ఆమె వ్యాఖ్యానించారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికలు - 2024 నేపథ్యంలో తిరుపతిలోని పలు పోలింగ్ బూత్ లను, చెక్ పోస్టులను తిరుపతి శాసనసభ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు ఉజ్వల్ కుమార్ ఘోష్ ఈ ఉదయం తనిఖీలు చేపట్టి పలు సూచనలు చేశారు. తిరుపతి పరిధిలోని ఎస్.వి. పాలిటెక్నిక్ కళాశాల, ఎస్వీ క్యాంపస్ స్కూల్, సత్యనారాయణపురం కొర్లగుంట, తిరుమల పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. అలాగే నారాయణాద్రి హాస్పిటల్ , విద్యానగర్, తిమ్మి నాయుడు పాలెం వద్ద ఉన్న చెక్ పోస్టులను ఆయన పరిశీలించారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికలు పారదర్శకతతో నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళ సింగ్ అన్నారు. ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై బాపట్ల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, ఎస్పీ, రిటర్నింగ్ అధికారులు, జిల్లా నోడల్ అధికారులతో బాపట్ల కలెక్టరేట్లో సమావేశం నిర్వహించారు. ముందుగా బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిమళ సింగ్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు మే 13వ తేదీన సమర్థంగా నిర్వహించడానికి అధికారులంతా సంసిద్ధం కావాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆ కేంద్రాల వద్ద వెబ్ క్యాస్టింగ్, వీడియోగ్రఫీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా సరిహద్దులలో నిరంతరం తనిఖీలు చేపట్టాలని సూచించారు.

---------------------------

అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకుంటామని అనంతపురం జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఆయన నిన్న జిల్లాలోని శింగణమల,

గార్లదిన్నె మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, అక్కడ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలకు ఓటు హక్కు ప్రధాన్యతను వివరించారు.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో భాగంగా ఈరోజు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఈ మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాలకు మ్యాచ్ జరగనుంది. చెన్నై వేదికగా చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య ఈ రాత్రి 7 గంటల 30 నిమిషాలకు మ్యాచ్ ప్రారంభమౌతుంది. నిన్న దిల్లీలో ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో దిల్లీ క్యాపిటల్స్ జట్టు 10 పరుగుల తేడాతో గెలుపొందింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన దిల్లీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 257 పరుగులు చేసింది. 258 పరుగుల లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాటింగ్‌కు దిగిన ముంబయి జట్టు 9 వికెట్ల నష్టానికి 247 పరుగులకే పరిమితమైంది. లఖ్‌నవూలో నిన్న జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టు 7 వికెట్ల తేడాతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌ను ఓడించింది.

======================